ప్రజాశక్తి
మంగళవారం 10 జనవరి 2023
5
పార్వతీపురం మన్యం

చదురుగుడికి పోలమాంబ

మక్కువ: శంబర పోలమాంబ అమ్మవారిని వనం గుడి నుండి మేళ తాళాలు నడుమ చదురు గుడిలోకి సోమవారం తీసుకొచ్చారు. మంగళవారం నుంచి పోల మాంబ అమ్మవారి జాతర మొదలుకానుంది. ఈనెల 23 నుంచి 25 వరకు జరిగే తోలేలు, సిరిమాను, అంపక వర్షం అనంతరం మళ్లీ పోలమాంబను వనం గుడిలోకి చేర్చనున్నారు. కార్యక్రమం లో దేవాదాయశాఖ ఇఒ రాధాకృష్ణ, ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ దాలినాయుడు ఎంపిటిసి తీళ్ల పోలి నాయుడు, సర్పంచ్ గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

అమ్మవారిని చదురుగుడికి తీసుకొస్తున్న ఆలయకమిటీ సభ్యులు

చలి...పులి

- 8 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు
- ఏజెన్సీని కప్పేసిన మంచుదుప్పటి

ఏజెన్సీలో మంటకాగుతున్న చిన్నారులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా చలి చంపేస్తోంది. ప్రధానంగా ఏజెన్సీలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు 8 నుంచి 10 డిగ్రీలకు పడిపోవడంతో ప్రజలు గజగజలాడి పోతున్నారు. చుట్టూ కొండలు, అడవులు దగ్గరగా ఉండడంతో దట్టమైన పొగ మంచుతో చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీంతో పగటి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. మైదాన ప్రాంతమైన బాడంగి, రామభద్రపురం, బొబ్బిలి,సాలూరు తదితరు మండలాల్లోనూ ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్నాయి. జిల్లా అంతటా ఐదు గంటల నుంచి ప్రారంభమైన మంచు ప్రభావం మరుసటి రోజు ఉదయం 11 గంటల వరకు ఉండడంతో రోజంతా చలి తీవ్రత కనిపిస్తోంది. దీనికి తోడు చలి గాలులు కూడా వీస్తున్నాయి. అత్యల్ప ఉష్ణోగ్రతలు డిగ్రీలు నమోదవ్వడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. వివిధ పనులపై వేరే ప్రాంతాలకు ప్రయాణాలు సాగించేవారు సాయంత్రం అయ్యేసరికి ఇళ్లకు చేరుకుంటున్నారు. దూరప్రాంతం ప్రయాణించేవారు సూర్యుని కాంతి చూశాక బయలు దేరుతున్నారు. గిరిజన గ్రామాల్లో ప్రజలు, యువత చలిని తట్టుకునేందుకు చలి మంటలు వేసుకొని వెచ్చదనం పొందుతున్నారు. మరోవైపు రగ్గులు, స్వెట్టర్లకు గిరాకీ పెరిగింది. చలి ప్రభావం ఎక్కువగా ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకుని బయటకు రావాలని వైద్యులు సూచిస్తున్నారు.

జియ్యమ్మవలస : గత మూడు రోజులుగా చల్లని గాలులు వీయడంతో చలి తీవ్రత పెరిగి మంచు కూడా పడడంతో ప్రజలు చలిమంటలు వేసుకుంటున్నారు. గత మూడు నాలుగు ఏళ్లుగా చలి తెలియని ప్రజానీకానికి ఒకేసారి చలి పంజా విసిరింది. దీంతో మూలన పడేసిన చలి కోట్లు, రగ్గులు తీసుకొని బయట తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం 11 డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతకు పడిపోయింది. సాధారణం కంటే తక్కువగా 29 డిగ్రీలు నమోదు అవుతుంది. దీంతో ఉదయం 10 గంటల వరకు చలి తీవ్రత ఉంటున్నది. మరో నాలుగైదు రోజులు పాటు ఇదే పరిస్థితి కొనసాగవచ్చునని సంబంధిత వాతావరణశాఖ అధికారులు అంటున్నారు. సంక్రాంతి ముందు చలిగాలులు తీవ్రత పెరగడంతో పొలం పనులు చేసుకునే రైతులు అవస్థలు పడుతున్నారు.

మూడురోజులుగా..

వంగర : మండలంలో గత మూడు రోజులుగా ఉదయం, రాత్రి వేళల్లో వీస్తున్న చలి గాలులతో ప్రజలు వణుకు పోతున్నారు. వాహనాలపై ప్రయాణం చేయడానికి చలికి భయపడుతున్నారు. కార్మికులు పనులకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు చిన్న పిల్లలు చలి నుండి రక్షించుకునేందుకు మంటలు పెట్టి కా గుతున్నారు. మండలం చుట్టూ నాగావళి, సువర్ణ ముఖి, వేగావతి నదులతో పాటు మడ్డువలస జలాశయం ఉండడంతో చలి గాలులు మరింత ఎక్కువగా ఉన్నాయని ప్రజలు చెబుతన్నారు.

మంచు ఎక్కువగా ఉండడంతో లైట్ల సాయంతో వెళ్తున్న వాహనాలు

వైద్య కళాశాల నిర్మాణం వేగవంతం

- వచ్చే ఏడాది నుంచే తరగతులు ప్రారంభం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని
- వైద్య కళాశాల పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరంలో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలో వచ్చే విద్యా సంవత్సరం (2023-24) నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని వెల్లడించారు. కళాశాల నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. రూ.35 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న తాత్కాలిక భవనాల నిర్మాణం దాదాపు ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి పూర్తవుతుందని మంత్రి చెప్పారు. జిల్లా కేంద్రంలోని గాజులరేగ వద్ద నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సోమవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబు, ఎపిఎంఎస్ఐడిసి ఎమ్‌డి మురళీధర్ రెడ్డి తో కలసి పరిశీలించారు. వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ అధికారులు, నిర్మాణ సంస్థ ఎన్.సి.సి. ప్రతినిధులు నిర్మాణ పనుల ప్రగతిని మంత్రికి వివరించారు. రాష్ట్రంలో నిర్మాణం పనులు ప్రారంభించిన ప్రభుత్వ కళాశాలల్లో మచిలీపట్నం, విజయనగరంలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వైద్య ఆరోగ్య ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు మంత్రికి వివరించారు.

అనంతరం మంత్రి విడదల రజని మీడియాతో మాట్లాడుతూ రూ.500 కోట్ల వ్యయంతో ఇక్కడ వైద్య కళాశాల ఏర్పాటవుతుందని చెప్పారు. 150 సీట్లతో వైద్య కళాశాల వచ్చే ఏడాది ప్రారంభం అవుతుందని, తద్వారా ఈ ప్రాంత ప్రజలకు వైద్య విద్య అందుబాటులోకి వస్తుందని అన్నారు.

రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా

వైద్య కళాశాల పనులను పరిశీలిస్తున్న మంత్రి రజని

జిల్లా సర్వజన ఆసుపత్రిని మంత్రి విడుదల రజని తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన ఓపి రిజిస్ట్రేషన్ బ్లాక్, సెమినార్ హాలును ముందుగా సందర్శించారు. అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను, వార్డులను, ఐసియు విభాగాలను తనిఖీ చేశారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. రోగుల పేర్లను నమోదు చేసిన రిజిష్టర్లను పరిశీలించారు. మహిళల జనరల్ వార్డులో రోగులతో మాట్లాడి, వైద్య సేవలు, మందుల సరఫరా తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు. ఈ పర్యటనలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంఎల్ఎ బొత్స అప్పలనరసయ్య, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, ఎపిఎంఎస్ఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ మురళీధరరెడ్డి, వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఇఇ సత్య ప్రభాకర్, జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్‌వి రమణకుమారి, డిసిహెచ్ఎస్ గౌరీ శంకర్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలత, ఆసుపత్రి సూపరింటిండెంట్ అప్పలనాయుడు, కార్యక్రమంలో ఆర్‌డిఒ సూర్యకళ, డిఎంహెచ్ఒ రమణ కుమారి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ లీల తదితరులు పాల్గొన్నారు.

నిలువునా దోచేశారు

- ప్రత్యేక ఉపకలెక్టర్ ఎదుట రైతుల మొర
- 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

జామి : ధాన్యం కొనుగోలులో మిల్లర్లు నిలువునా దోచేశారంటూ ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శన దొర ఎదుట రైతులు వాపోయారు. రైతుల నుంచి మిల్లర్లు అధిక మొత్తంలో వసూళ్లు చేస్తున్నారన్న దానిపై ప్రజాశక్తి వరుస కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. అయితే ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో అధికారులకు రైతులు నేరుగా ఫిర్యాదు కూడా చేశారు. ఈ నేపథ్యంలోనే స్పందించిన ఉన్నతాధికారులు విచారణకు సిద్ధమయ్యారు. అందులో భాగంగానే ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శన దొరను విచారణ అధికారిగా కలెక్టర్ నియమించారు. ఈ నేపథ్యంలో సోమవారం జామి మండలంలో గల రైతులను తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపిడిఒ సతీష్, వ్యవసాయాధికారి కిరణకుమార్ సమక్షంలో సుదర్శన దొర విచారించారు. రైతుల నుంచి నేరుగా వివరాలు సేకరించారు. అయితే రాధాకృష్ణ, శ్రీనివాస రైస్ మిల్లు యాజమాన్యాలు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

సమస్యలకు సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతులపై కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కరిస్తున్నారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో బత్తిలి స్వయం సహాయక సంఘాలకు గ్రామీణ వికాస్ బ్యాంకు నందుగల అక్కౌంట్లను బ్లాకు చేశారని కలెక్టరుకు అర్జీ అందజేయగా లీడ్ బ్యాంకు మేనేజరు జె.ఎల్.ఎన్.మూర్తితో మాట్లాడి బ్యాంకు అధికారులకు ఆదేశాలు జారీచేసి బ్యాంకు అక్కౌంట్లను వెంటనే పునరుద్ధరించారు. స్పందనలో వచ్చిన అర్జీలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టరు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జెసి ఒ.ఆనంద్, ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్‌తో కలిసి స్పందన కార్యక్రమంలో ప్రజలనుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టరు నిశాంత్ కుమార్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ధరఖాస్తులను స్పందన యాప్‌లో పరిశీలించగా 31 పెండింగులో ఉన్నాయని, 68 ఆర్జీలు అధికారులు ఇంకా చూడలేదని, అర్జీలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప అధికారులు సెలవుపై వెళ్లినపుడు ముందస్తు అనుమతి తీసుకోవాలని, సెలవు సమయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, సమావేశాల వివరాలను తెలియజేయాలని తెలిపారు. బడిమానివేసిన వారి వివరాలను విద్యాశాఖ, పౌష్టికాహార లోపం గల పిల్లల వివరాలను ఐసిడిఎస్‌కు పంపించాలని తెలిపారు. పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధవహించాలని, దీన్ని పర్యవేక్షించేందుకు బాధ్యులను నియమించాలని అన్నారు. గురువారం నిర్వహించే వీడియో కాన్ఫరెన్సు, కావాల్సిన సమాచారాన్ని వెంటనే సిద్ధం చేయాలని, వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా గణాంకాలను రాష్ట్రస్థాయిలో ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందనకు 119 అర్జీలు వచ్చాయి.

వికలాంగుల స్పందనకు స్పందనకు 5 అర్జీలు

జిల్లాలోని వికలాంగులకు కలెక్టరేట్ సెల్లారులో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో ఐదు అర్జీలు అందాయి. వీటిలో సాలూరు మండలం జోగిరాంకు చెందిన తెంటు నరశింహం వినికిడియంత్రం మంజూరుచేయాలని, పార్వతీపురంలోని పాతబెలగాంకు చెందిన పాలకొల్లు రాజు ట్రై సైకిలు మంజూరు చేయాలని అర్జీ అందజేశారు. గరుగుబిల్లికి చెందిన పోతనపల్లి చంటి, పాటూరి హేమప్రసాద్, చింతాడ సురేష్ స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకొనేందుకు అవసరమైన వ్యక్తిగతరుణం మంజూరు చేయాల్సిందిగా కోరారు. విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషను ద్వారా పాలకొండ మండలం కొండాపురానికి చెందిన నల్లబారికి చంద్రశేఖర్‌కు రూ.30వేలు విలువచేసే లాప్ టాప్ జిల్లా కలెక్టరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలుశాఖ జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఓటరు తుదిజాబితా విడుదల

ప్రజాశక్తి - కలెక్టరేట్

పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలు, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం-2023 ఓటరు తుది జాబితా విడుదల చేసినట్లు జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలను వారికి అందజేశారు. సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూలు ప్రకారం పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు ఓటర్లు నమోదు, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం-2023 విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలిపారు. పట్టబద్రుల శాసనమండలి ఎన్నికలకు జిల్లాలో 18,327 మంది ఓటర్లు నమోదు చేసినట్లు తెలిపారు వారిలో 12380 మంది పురుషులు, 5945 మంది మహిళలు, ఇద్దరు ట్రాన్స్ జెండర్స్ ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం-2023 ద్వారా ఓటరు నమోదు, ఓటరు జాబితా శుద్ధీకరణ అనంతరం జిల్లాలో 774573 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 379133 మహిళలు 395377 మంది ట్రాన్స్ జెండర్స్ 63 మంది ఉన్నారని తెలిపారు. పాలకొండ లో 197976 మంది, కురుపాంలో 191112మంది, పార్వతీపురంలో 188090 మంది, సాలూరులో 197395 మంది ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. ఈసమావేశంలో కలెక్టరు కార్యాలయ ఎఒ ఆర్.ఉమామహేశ్వర రావు, ఇ-సెక్షన్ సూపరింటెండెంట్ డి.రవి, రాజకీయ పార్టీల ప్రతినిధులు జె.భాస్కరరావు, ఎ.పేర్రాజు, జి.వెంకటనాయుడు, డి.రవి, బి. మహేశ్వరరావు, వి.చంటి, పి.శ్రీను తదితరులు హాజరైనారు.

రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రతినెలా 1న పింఛను అందజేయాలి

సాలూరు: ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన పింఛను మొత్తాన్ని అందజేయాలని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం మండలతహశీల్దార్,సబ్ ట్రెజరీ అధికారి కి వినతి పత్రాలు అందజేశారు.సంఘం తాలూకా యూనిట్ అధ్యక్షుడు బాలబోలు ధనుంజయ రావు ఆధ్వర్యాన రిటైర్డ్ ఉద్యోగులు వినతి పత్రాలు సమర్పించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పింఛను మొత్తాన్ని ఆలస్యంగా ఖాతాల్లో జమ చేయడం వల్ల తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు.రిటైర్డ్ ఉద్యోగుల కు ఆరోగ్య పరమైన అవసరాలు,ఇతర కుటుంబ పోషణ ఖర్చులు వుంటాయని, సకాలంలో మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.గత కొద్దినెలలుగా పింఛను మంజూరు లో తీవ్ర జాప్యం జరుగుతోందని చెప్పారు.ఒకటో తేదీన పింఛను మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఎస్టిఓ వైకె నాయుడుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు డిజె ప్రసాద్ పాల్గొన్నారు.

అల్లువాడలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని అల్లువాడలో సోమవారం అగ్నిప్రమాదం సంభవించింది. గ్రామ సమీపంలో ఉన్న కళ్లాల్లోని వరిగడ్డి కుప్పలు అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. రైతులంతా కళ్లాంలో ధాన్యం నూర్పిడిలో ఉంటుండగా అనుకోకుండా ప్రమాదం సంభవించి వరిగడ్డి కప్పులు అంటుకున్నాయి. సమీపంలో ధాన్యం బస్తాలు, ధాన్యం రాశులు ఉండడంతో రైతులు భయభ్రాంతులకు గురయ్యారు. గ్రామం సమీపంలో ఉండడంతో గ్రామస్తులంతా వచ్చి ప్రమాదం సంభవించిన చోట అగ్నిమాపక వాహనం రాకముందు నీటిని చుట్టూ పోయడంతో చుట్టూ ఉన్న వరి గడ్డి కుప్పలు, ధాన్యం కుప్పలు, ధాన్యం బస్తాలు అగ్ని ప్రమాదానికి గురికాకుండా రైతులు కాపాడుకున్నారు. దీంతో రైతులంతా పెద్ద ప్రమాదం నుంచి బయట పడ్డారు. ఇదే ప్రమాదం ఏ రాత్రిలో జరిగితే ఊహించని నష్టం జరిగేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్నటు ధాన్యం కూడా పూర్తిగా కాలి బూడిదయ్యవని ఉదయం జరగడంతో అప్రమత్తమై మంటలను అదుపు చేసుకోగలిగామని రైతులు ఊపిరి పీల్చుకున్నారు. గుమ్మలక్ష్మీపురం నుండి అగ్నిమాపక వాహనం వచ్చి పూర్తిస్థాయిలో మంటలను అదుపు చేసింది.

మంటలను అదుపు చేస్తున్న రైతులు

పోలమాంబ గుడుల అభివృద్ధిపై ప్రతిఏటా అదే పా(మా)ట

- చదురు గుడి అభివృద్ధిపై శ్రద్ధ చూపుని యంత్రాంగం
- యాత్రికులకు తప్పని పాట్లు

అభివృద్ధికి నోచని చదురుగుడి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారు.. ఈ పేరు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు సరిహద్దు రాష్ట్రాల్లో కూడా తెలియని భక్తులంటూ ఉండరని చెప్పడంలో అతిశయోక్తి కాదు. పది వారాల పాటు రికార్డు స్థాయిలో జరిగేది ఈ జాతర. ఏటా లక్షలాది రూపాయలు ఆదాయం తెచ్చిపెట్టే అమ్మవారి జాతర ఇదే అనడంలో సందేహం అక్కర్లేదు. ఇంతటి కీర్తి కలిగిన శంబర పోలమాంబ అమ్మవారు ఇరుకు సందుల్లో ఉన్న ఇళ్ల మధ్య గూడు కట్టుకొని ఉన్నారని ఒకింత బాధతో చెప్పక తప్పదు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో రెండో అతిపెద్ద జాతర శంబర పోలమాంబ జాతర. జిల్లాల విభజన అనంతరం ఈ ఏడాది మన్యం జిల్లాలో అతిపెద్ద గిరిజన దేవత జాతరగా అవతరించనుంది. జాతర సమయం సమీపిస్తున్నప్పుడల్లా దేవాదాయశాఖతో పాటు ఉన్నతాధికారులంతా సమీక్ష మీద సమీక్షలు జరుపుతూనే ఉంటారు. అయితే ప్రతిసారి శంబరలో ఉన్న అమ్మవారి చదును గుడి ఆలయ అభివృద్ధిపై చర్చ జరుగుతున్నప్పటికీ ఆదిశగా అడుగులుపడకపోవడం భక్తుల నుంచి విమర్శలకు దారి తీస్తోంది. భక్తుల నుండి వచ్చే ఆదాయం హుండీలో నిండుతున్నప్పటికీ కార్యాలయ అభివృద్ధి విషయానికి వచ్చేసరికి గుండు సున్న మాదిరిగా ఉందన్న విమర్శలకు దారి చూపిస్తోంది. చదురుగుడి, వనంగుడిలో అభివృద్ధిపై ప్రతి ఏటా ప్రతిపాదనను పాటే పాడుతున్నారు తప్ప కార్యరూపానికి నోచుకోవడం లేదు. కొన్నేళ్లు తర్వాత మళ్లీ ట్రస్ట్ బోర్డు ఏర్పాటు చేసుకున్నప్పటికీ ఆలయ అభివృద్ధికి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం ఆశించినంత శ్రద్ధ చూపడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. ట్రస్ట్ బోర్డు అని చెప్పుకోవడమే తప్ప సాధించిందేమీ లేదని పలువురు పెదవి విరుస్తున్నారు. గ్రామంలో చదురుగుడికి ఆనుకొని ఉన్న ఇళ్లను తొలగించేందుకు ఆ కుటుంబాలకు సరిపడా పరిహారం ఇప్పించి ఆలయం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అలా చేసినట్లయితే అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తొలగి ప్రశాంతత తప్పకుండా లభిస్తుంది. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని పోలమాంబ భక్తులు కోరుతున్నారు.అలాగే శాశ్వత కేసుఖండన సాల విధులు నిర్వహణకు వచ్చే ఉద్యోగులు భక్తుల కోసం విశ్రాంతి సముదాయాలను ఏర్పాటు చేయాలని కూడా భక్తులు కోరుతున్నారు.

మెరుగుపడ్డ రోడ్లు

పోలమాంబ అమ్మవారిని దర్శించుకునేందుకు జాతరకు బస్సులు, ఇతర వాహనాలపై వచ్చే భక్తులకు ప్రతి ఏటా రహదారి అవస్థలు తప్పాయని చెప్పవచ్చు. సాలూరు నుంచి మామిడిపల్లి మీదుగా శంబరకు, మక్కువ నుంచి కవిరిపల్లి మీదుగా వెళ్లే రహదారులు పక్కాగా నిర్మించారు. అలాగే శంబర నుంచి గోముఖీ నది వంతెన వరకు వేసిన సిసి రోడ్డు కూడా భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది అయితే మండల కేంద్రానికి బొబ్బిలి, సాలూ రు రహదారులు మాత్రం అధ్వానంగా ఉన్నాయి.

ఈసారైనా అబాసు పాలు కాకుండా చూడాలి

గతేడాది జాతర చివర్లో ఏర్పాటు చేయబడ్డ మహా అన్నదాన కార్యక్రమం ఒకింత విమర్శలకు గురై అబాసపాలుగా మారింది. శంబరలోనే ఉన్న ప్రజలకు మధ్యాహ్న భోజన సమయానికి కూడా అన్నం దొరకని పరిస్థితి ఏర్పడింది. వేలాది రూపాయలు ఈ కార్యక్రమానికి ఖర్చు చేసినట్లు రికార్డులు చూపిస్తారు కానీ ఆ స్థాయిలో ఈ కార్యక్రమం జరగదని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ ఏడాదైనా భక్తుల మనోభావాలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

శంబర నుంచి గోముఖి నది వరకు నిర్మించిన సిసి రోడ్డు

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధాన్యం రైతులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల నుంచి ఒక్క గింజ కూడా మిగలకుండా కొంటామని చెప్పి ప్రకటనలు చేస్తుంది తప్ప ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. గత పది రోజులుగా ధాన్యం కళ్లాల్లో నూర్పుడు చేసి కుప్పలు వేసి ఉన్నప్పటికీ ధాన్యాలు తీసుకునే నాధుడే కరువయ్యాడన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడే పంటకు అమ్ముకునే పరిస్థితి కూడా లేదన్నారు. ధాన్యం కోసం రైతు భరోసా కేంద్రాల వద్ద ఎటువంటి ఫలితం లేదని ఆయన అన్నారు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు మాట్లాడుతూ రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అధికారులు నానా ఇబ్బందులు పెడుతున్నారని తక్షణమే రైతుల వద్ద ధాన్యాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిటి షేక్ ఇబ్రహీం, ఎఒ ఎస్.అవినాష్ రైతుల వద్దకు వచ్చి మాట్లాడుతూ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రెడ్డి రమణమూర్తి, రెడ్డి ఈశ్వరరావు, ఆర్.సత్యనారాయణతో పాటు రామవరం, రెడ్డివానివలస, అనంతరాజుపేట, అంటిపేట, కాసిపేట చెందిన రైతులు పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి -కొమరాడ

108 ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. తమ న్యాయమైన కోర్కెల కోసం 108 సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో వివిధ రూపంలో చేస్తున్న నిరసన, ర్యాలీలకు సిఐటియు, ఇతర సంఘాలు పూర్తిగా మద్దతు తెలిపాయన్నారు. 108 సిబ్బంది న్యాయబద్ధంగా కోర్కెల కోసం వివిధ రూపంలో చేస్తున్న పోరాటానికి సిఐటియు మద్దతు ఇస్తున్నామన్నారు. ఈనెల 15లోగా వారి సమస్యలు పరిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ నీలకంఠం, తదితరులు

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

సీతానగరం : స్థానిక డిజిన్ స్కూల్ మైదానం ఆవరణలో సోమవారం మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్ఐ కె.నీలకంఠం మాట్లాడుతూ యువకులు ఆటల పోటీల్లో పాల్గొని వారి శక్తి సామర్థ్యాలను, నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. క్రీడల్లో ప్రావీణ్యం వస్తే చదువులో కూడా ఆసక్తి పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆటలో పాల్గొనాలని అన్నారు. సంక్రాంతి సందర్భంగా ఇటువంటి ఆటల్లో యువకులు పాల్గొంటే చెడు వ్యసనాలకు లోనుకారని ఆయన అన్నారు. ఇటువంటి ఆట పోటీలను ప్రతి గ్రామంలోనూ జరిగితే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో పెదభోగిలి గ్రామ సర్పంచ్ జె.తేరేజమ్మ, ఎంపిటిసి సభ్యులు ఎస్.గౌరీశంకర్, సీతానగరం ఎంపిటిసి సభ్యులు బురిడి కుసుమ సూర్యనారాయణ, ఎల్విన్ అధినేత కె.అరవింద్ కుమార్, పశుసంవర్ధకశాఖ ఎడి సిహెచ్.దీనకుమార్, గ్రామపెద్దలు ఆర్ వి పార్థసారథి, హరిగోపాలరావు, సుంకర అప్పారావు, పి.పైడపునాయుడు, పి.రామారావు, వెంకన్నతో పాటు సీతానగరం, పెదబోగిలి, బుడ్డిపేట, అప్పయ్యపేట సుంకర వీధి పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

కొమరాడ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండంగి హరి కుటుంబానికి మోటర్ యూనియన్ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శుక్రవారం జీపు బోల్తా పడి మృతి చెందిన అల్లువాడకు చెందిన మండంగి హరి కుటుంబ సభ్యులకు శ్రీమజ్జి గౌరీ మోటర్ యూనియన్ సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. జీపు బోల్తా పడి మృతి చెందిన ఆటో డ్రైవర్ హరి కుటుంబాన్ని ఆదుకునేందుకు యూనియన్ సభ్యులంతా తలోచేయివేసి రూ.14 వేలు ఆర్థిక సహాయాన్ని అతని భార్యకు అందజేశారు. మోటారురంగంలో పని చేస్తూ జీవితాన్ని నెట్టుకొస్తున్న వారు ఇలా ప్రమాదాల బారిన పడి మృతి చెందడంతో కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. తమకు అవకాశం ఉన్నంతవరకు కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు అన్నివిధాలా కృషి చేస్తామని యూనియన్ సభ్యులు తెలిపారు. ఆర్థిక సహాయం అందించిన వారిలో సంతు శ్రీను (శ్రీకాంత్), గోప తదితరులు ఉన్నారు.

గ్రంథాలయానికి మైక్ సెట్‌ను అందిస్తున్న స్వామినాయుడు

గ్రంథాలయానికి మైక్ సెట్ వితరణ

బలిజిపేట : శ్రీకాకుళం జిల్లాలోని గురజాడ విద్యాసంస్థల అధినేత జివి స్వామినాయుడు పెదపెంకిలోని నేతాజీ గ్రంథాలయ స్థాపకులు ఈర్ల సంజీవినాయుడుకు మైకుసెట్, పుస్తకాలు సోమవారం అందించారు. ఈ సందర్భంగా స్వామినాయుడు మాట్లాడుతూ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు సాయం చేయడం గర్వించదగ్గ విషయమని అన్నారు. పెనుబోతు భాస్కరరావు, కాగాన సుధీర్, పెద్దింటి చంద్రమోహన్, పడతాన సత్యం, పెనుబోతు టైగర్ దుర్గాప్రసాద్, గొర్లె శ్రావణ్ కుమార్, డాక్టర్ శ్రీను, కర్రి సతీష్, తదితరులు స్వామినాయుడుకు అభినందనలు తెలిపారు.

అంగన్వాడీ పోస్టులకు 18 దరఖాస్తులు

గుమ్మలక్ష్మీపురం : భద్రగిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి 18 దరఖాస్తులు వచ్చాయని ఇన్చార్జి సిడిపిఒ ఎస్.ఈశ్వరమ్మ తెలిపారు. పుట్ట జమ్ము అంగన్వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుకు నలుగురు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు వచ్చాయన్నారు. అలాగే కోసింగి భద్ర అంగన్వాడి పోస్టుకు 5, టెంకసింగి అంగన్వాడీ పోస్టుకు 3, తాడికొండ అంగన్వాడీ పోస్టుకు 3 దరఖాస్తులు, గొరటి పోస్టుకు రెండు, కొండ బిన్నిడి మినీ అంగన్వాడి పోస్ట్ కు ఒక దరఖాస్తు చొప్పున వచ్చాయని ఆమె తెలిపారు. వచ్చిన దరఖాస్తులను స్క్రూటినీ అనంతరం బుధవారం పార్వతీపురంలో ఇంటర్వ్యూలో నిర్వహిస్తామని అన్నారు. అర్హులైన అభ్యర్థులకు సమాచారం ఇస్తామని తెలిపారు.

ఆర్‌బికెను సందర్శించిన వ్యవసాయశాఖ ఎడి

కురుపాం : మండలంలో గుజ్జువాయి పంచాయతీలో గల ఆర్‌బికెను వ్యవసాయ శాఖ ఎడి నిర్మల జ్యోతి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌బికెలో రైతులకు అందిస్తున్న సేవలు గూర్చి వ్యవసాయ సహాయకులకు అడిగి తెలుసుకుని అనంతరం రికార్డులను పరిశీలించారు. రైతులకు అందించాల్సిన సేవలు సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగేశ్వరరావు ఆర్.బి.కె సిబ్బంది పాల్గొన్నారు.

రిఫరల్ కేసులకు వేరే వాహనాలు పెట్టండి

పార్వతీపురం టౌన్ : అత్యవసర పరిస్థితులకు 108 వాహనాలు అందుబాటులో ఉండటం లేదని జనసేన పార్టీ నాయకులు అన్నారు. సోమవారం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్‌ను కలిసిన ఆ పార్టీ నాయకులు వంగల దాలినాయుడు, మండల శరత్ కుమార్ వినతి పత్రాన్ని అందించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో పిలిచిన వెంటనే 108 వాహనాలు రావడం లేదని, ఆలస్యం అవుతుందంటూ, వాహనాలు అందుబాటులో లేవంటూ సమాధానాలు వస్తున్నాయనీ, దీనికి ప్రధాన కారణం పార్వతీపురం, సాలూరు తదితర ప్రాంతాల నుండి విజయనగరానికి రిఫరల్ కేసులు తీసుకెళ్లేందుకు 108 వాహనాలు వాడటమే అనీ అన్నారు. ఆయా రిఫరల్ కేసులకు పార్వతీపురం, కొమరాడ, చినమేరంగి, సీతానగరం తదితర మండలాలకు చెందిన వాహనాలను వినియోగిస్తుండడంతో, ఆయా ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వాహనాలు అందుబాటులో ఉండటం లేదన్నారు. రిఫర్ కేసులకు వేరే వాహనాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్ తక్షణమే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు..

ప్రధానోపాధ్యాయుల సమావేశం

గుమ్మలక్ష్మీపురం : రాష్ట్ర విద్యాశాఖ నిర్దేశించిన పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలు, పాఠశాలల సముదాయ హేబిటేషన్ ప్రణాళికలపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో అవగాహన సమావేశాన్ని ఆయా పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సోమవారం నిర్వహించారు. ఈ మేరకు ఎంఇఒ నారాయణస్వామి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలు, హేబిటేషన్ ప్లాన్ లను ఏ విధంగా తయారు చేయాలో ఉపాధ్యాయులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించామన్నారు. ప్రతి పాఠశాల నుంచి ఆయా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాలల అభివృద్ధికి కావలసిన ప్రణాళికలను ఇప్పటి నుంచే తయారు చేసి మండల విద్యా వనరుల శిక్షణ కేంద్రానికి బుధవారం సమర్పించాలని కోరారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయా పాఠశాలకు తగిన మేరకు నిధులు మంజూరు చేసే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు ఉపాధ్యాయులంతా తప్పనిసరిగా తమ పాఠశాలకు చెందిన ప్రణాళికలను బుధవారం అందజేయాలని కోరారు.

4250 ఎకరాల్లో బిందు సేద్యం లక్ష్యం : పీడీ

పంటలను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసరావు

మక్కువ : పార్వతీపురం మన్యం జిల్లాలో ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా 4250 ఎకరాల్లో బిందు సేద్యం లక్ష్యంగా నిర్ణయించామని ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎల్ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని మార్కొంటపుట్టి పంచాయతీ పరిధిలోని పెద్ద గైసాల పరిసర గ్రామాల్లో బిందు సేద్యం ద్వారా సాగవుతున్న ఆయిల్ ఫామ్ ఇతర పంటలను ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు ఎకరాలలోపు ఉన్న రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందజేస్తున్నామన్నారు. ఐదు ఎకరాలు దాటిన రైతులకు 50 శాతం సబ్సిడీపై పరికరాలు అందిస్తున్నామన్నారు 1670 మంది రైతులు తమన పేరు నమోదు చేసుకోగా ఇప్పటికే 280 మంది రైతులకు ఈ పథకం మంజూరు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాల సహకారాలు అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఐపి ఇంజనీర్ కేశవరావు, రైతులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు

మండల సర్వసభ్య సమావేశంలో ఏకరువు పెట్టిన సభ్యులు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

ధాన్యం సేకరణలో రైతులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఎంపిటిసిలుసభ్యులు, సర్పంచ్‌లు సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఏకరువు పెట్టారు. ముఖ్యంగా రైతులు ధాన్యం తీసుకువెళ్లడానికి సకాలంలో అనుమతులివ్వపోవడంతో ఇబ్బందులుపడుతున్నారని, వాహనాలు ఏర్పాటు చేయడంలో కూడా నిర్లక్ష్యం చూపుతున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనివల్ల గ్రామాల్లో రైతులు నుంచి తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపాగాం సర్పంచ్ వావిలపల్లి రాజారావు, చింతాడ సర్పంచ్ కణపతితో పాటు మరికొంత మంది అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎంఎల్సీ పాలవలస విక్రాంత్ కలుగజేసుకుని ఈ సమస్య అన్నిచోట్ల ఉందని, ఈ విషయం జెసి దృష్టికి కూడా తాను తీసుకువెళ్లానని చెప్పారు. ఎవరికైనా ఎక్కడైనా సమస్య ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీఇచ్చారు. ఇటువంటి సమావేశాల్లో కూడా ఎప్పటికప్పుడు ఎదురవుతున్న సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించుకునేలా చూడాలన్నారు. విద్యుత్‌శాఖపై జరిగిన చర్చలో ఎంఎల్సీ కలగజేసుకుని విద్యుత్‌శాఖ పనితీరు అధ్వాన్నంగా ఉందని, విద్యుత్ స్తంభాలు కూడా పలు గ్రామాల్లో ఏర్పాటు చేయడం లేదని నిలదీశారు. ఇటువంటి పరిస్థితి ఉంటే ఎలా అంటూ ప్రశ్నించారు. బాధ్యతగా పనిచేయాలని హెచ్చరించారు. అదే విధంగా ఉపాధిహామీ శాఖపై జరిగిన చర్చలో ఉపాధిహామీ చట్టం ద్వారా వేసిన మొక్కలు బాధ్యతగా వ్యవహరించి వాటి పెంపుదలకు కృషి చేయాలన్నారు. సమావేశానికి ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపిలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనీల్‌కుమార్, తహశీల్దార్ పి.సోమేశ్వరరావు, ఎంపిడిఒ డొంక త్రినాధులు, పలుశాఖల అధికారులు, ఎంపిటిసిసభ్యులు, సర్పంచులు ఉన్నారు.

ఊపందుకున్న బట్టల వ్యాపారం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

సంక్రాంతి సమీపిస్తుండడంతో గ్రామాల్లో బట్టల వ్యాపారం బిజీబిజీగా కొనసాగుతోంది. బట్టలు వ్యాపారం చేసిన వారే కాక సీజనల్ వ్యాపారులు కూడా బట్టలను గ్రామాలకు తీసుకొచ్చి వ్యాపారం కొనసాగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలకు బట్టలు వ్యాపారులు తమ వాహనాల్లో వివిధ రకాల దుస్తులను పట్టుకొచ్చి విక్రయిస్తున్నారు. బట్టల్లో నాణ్యత కొంచెం తక్కువ ధరకు రావడంతో గ్రామాల్లో తమ పిల్లలకు తక్కువ ధరలో బట్టలు దొరుకుతున్నాయని భావించి ఇక్కడే విక్రయిస్తున్నారు. రూ.100 నుంచి రూ.400లోపు నాణ్యత గల బట్టలు లభించడంతో మహిళలు బట్టలపై ఆసక్తి కనబరుస్తూ తమ పిల్లలకు అతి తక్కువ ధరలోనే కొనుగోలు చేసుకుంటున్నారు. 15 ఏళ్ల లోపు పిల్లలకు బట్టలు లభించడంతో పట్నం వెళ్లే కన్నా ఇదే మిన్నంటూ తమకు నచ్చినవి ఎంచుకుంటూ బట్టలు కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో సీజనల్ వ్యాపారులకు కాసుల వర్షం కురుస్తుంది.

పలుచోట్ల 'గడపగడపకు మనప్రభుత్వం'

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని వంతరాంలో సోమవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సంద్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులు అందర్నీ గుర్తించి వారి ఇంటికే సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. అనంతరం గడప గడపకు వెళ్లి ప్రజలను ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకుని, ఎవరికైన ఇంకా అర్హత ఉంటే వారికి కూడా పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు అలజంగి రవికుమార్, ఎంపిపి గుడివాడ నాగమణి, వైస్ ఎంపిపి వెలిది సాయిరాం, మండల పార్టీ అధ్యక్షులు పి.మురళీకృష్ణ, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు కురిటి వెంకటరమణ, అలజంగి సుందరరావు, పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు, పలుశాఖల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, పాల్గొన్నారు.

పాలకొండ : ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని స్థానిక ఎంఎల్ఎ విశ్వాసరాయి కళావతి అన్నారు. సోమవారం మండలంలో అట్టలిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. ఈ విషయాన్ని ప్రజలందరూ గ్రహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బొమ్మాళి భాను, వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, ఎంపిడిఒ డొంక త్రినాధులు, తహశీల్దార్ పి.సోమేశ్వరరావు తదితరులున్నారు.

గుమ్మలక్ష్మీపురం : సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించడంలో నిబద్ధతగా వ్యవహరించడం కేవలం వైసిపి ప్రభుత్వానికే సాధ్యమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని గోయిపాక సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఎస్‌టి గొయ్యిపాక, ఎస్‌సిగొయ్యిపాక, రసాబడి, పిత్తలంబ, టంకు, గుల్లలంక గ్రామాలను సందర్శించి ఇంటింటికి తిరిగారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటుగా ఉమ్మడి జిల్లాపరిషత్ ఉపాధ్యక్షుడు బాపూజీ నాయుడు, ఎంపిపి కుంబురుకు ధీనమయ్య, వైస్‌ఎంపిపి నిమ్మక శేఖర్, నిమ్మక లక్ష్మణరావు, జెడ్‌పిటిసి మండంగి రాధిక, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గిరిబాబు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బొత్తాడ గౌరీశంకరరావు, గొయ్యిపాక సర్పంచ్ కారంగి లక్ష్మీ, ఎంపిటిసి కవిత, నాయకులు మాధవ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం అన్నారు. సోమవారం గుమ్మలక్ష్మీపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశానికి దిశా దిశ నిర్దేశించిన కాంగ్రెస్ గిరిజన, హరిజన, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కొన్నేళ్లుగా సేవలందించిన ఏకైక పార్టీగా గుర్తింపు పొందిందన్నారు. అటువంటి కాంగ్రెస్ నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయిందన్నారు. బిజెపి అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలతో ప్రజలు పూర్తిగా విసుగు చెందారన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారని తెలిపారు. జిల్లాలోని కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాలకు బాధ్యులను నియమించామని, పాలకొండ, సాలూరు ఇన్చార్జిలను త్వరలో నియమిస్తామని అన్నారు. గిరిజన ప్రాంతంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవానికి కృషి చేస్తానన్నారు. దుడ్డు ఖల్లు గ్రామానికి చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఇప్పుడు పార్టీలో చేరిన వారంతా గ్రామాల్లో పర్యటించి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు.

స్పందనకు 44 వినతులు

ప్రజాశక్తి- సీతంపేట

ఐటిడిఎ స్పందనకు 44 వినతులు వచ్చాయి. ఈ స్పందన కార్యక్రమం ఐటిడిఎలో సోమవారం పిఒ బి. నవ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పులిగుమ్మి గ్రామానికి చెందిన సవర నరసమ్మ టార్పాన్లు మంజూరు చేయాలని విన్నవించారు. అక్కన్న గూడ గ్రామానికి చెందిన సవర పెద్ద బాపన్న ఆయిల్ ఇంజన్ మంజూరు చేయాలని, రాజన్న గూడ గ్రామానికి చెందిన సవర రాసి కుట్టు మిషన్ మంజూరు చేయాలని, జలాంతర గ్రామానికి చెందిన మహేష్ తాగునీటి బోరు సోలార్ మోటార్ మంజూరు చేయాలని, వలగజ్జి గూడకు చెందిన భారతమ్మ కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలని, కేతన్ పేటకు చెందిన నారా మోహన్ రావు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, సవర భాష విద్యా వాలంటీర్లను రెన్యువల్ చేయాలని ఆ సంఘం నాయకులు ఎస్. రాజు వినతులు అందించారు. ఈ స్పందన కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. మురళి, ఎపిఒ రోషి రెడ్డి, డిడి నగేష్, సిడిపిఒ పి. రంగలక్ష్మి, ఎటిడబ్ల్యూఒ మంగ వేణి తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న పిఒ నవ్య

భామిని : మండలంలోని ఘనసరా, తలడా గ్రామాలలోని తోటలలో తిష్ట వేసిన నాలుగు ఏనుగులు, గ్రామాలోని కుప్పలుగా పోసిన ధాన్యం రాసులును, మొక్క జొన్న, అరటి మొక్కలు, వాటర్ ఇంజిన్ లు ధ్వంసం చేస్తున్నాయని ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలని సర్పంచ్ మజ్జి మోహన్‌బాబు, నాయకులు పాల్గుణరావు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని సార్లు గ్రామం సరిహద్దుల్లో ఏనుగులు సంచిరిస్తున్నాయని, దీని వల్ల పొలాల్లో తిరగాలంటే రైతులు బయపడుతున్నారని, సుమారు ఘనసరా, తలడా పరిసర ప్రాంతాలలో 100 ఎకరాలులో వివిధ వాణిజ్య పంటలు సాగువుతున్నాయని, పొలానికి వెళ్లకుండా పంటలు ఎలా పండిస్తామని, ఏనుగులు నుండి పంటలకు రక్షణ కల్పించాలని కోరారు.

సంక్షేమ పథకాలే అండ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ప్రజా సంకల్ప యాత్ర స్ఫూర్తి వైసిపిలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మెరుగైన పాలన అందిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు అన్నారు. 2017 నవంబర్‌లో ఇడుపులపాయ వద్ద చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర 3,648 కిలో మీటర్లు నడిచి 2019 జనవరి 9న ఇచ్చాపురం వద్ద ముగించి నేటికీ నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం స్థానిక వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించి అనంతరం వైసిపి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. ఈ మూడున్నర ఏళ్ల వైసిపి హయాంలో నవరత్నాల పథకాల ద్వారా సాధించిన సంక్షేమ పాలన ప్రగతిని, అభివృద్ధిని మరోసారి గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 సీట్లలో విజయకేతనం ఎగురవేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండల చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్ పర్సన్ కొండపల్లి రుక్మిణి, వైస్ చైర్మన్ ఇందుపూరు గుణేశ్వరరావు, మూడు మండలాల జెడ్‌పిటిసి సభ్యులు, ఎంపిపిలు, వైస్ ఎంపిపిలు, పట్టణ, మూడు మండలాల వైసిపి అధ్యక్షులు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్, ఎఎంసి చైర్పర్సన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పిఎసిఎస్ చైర్మన్లు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీ పురం

వైసిపి నాలుగేళ్ల పాలనలో గిరిజనులకు చేసిందేమీ లేదని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని దుడ్డుఖల్లులో సోమవారం ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీలో వందలాదిమంది చదువుకున్న గిరిజన యువతకు ఉపాధి చూపించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించిందన్నారు. మరోవైపు ధరల పెరుగుదలతో గిరిజనులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అర్హులైన వారికి ఇళ్ల మంజూరు కాలేదని, పెన్షన్లు తొలగించడం అన్యాయమని అన్నారు. వైసిపి ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నారని అన్నారు. గిరిజన బతుకులు బాగుపడాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని అన్నారు. ఇంటింటికి వెళ్లి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు గవరయ్య, కోటేశ్వరరావు, సన్నిబాబు, మండల బిసి సెల్ అధ్యక్షులు వెంకట్రావు, నాయకులు దాసు, లోవరాజు ఉన్నారు.

సీతంపేట : మండలంలో సోమగండి పంచాయతీలో నారీశక్తి అవార్డ్ గ్రహీత, టిడిపి నాయకులు పడాల భూదేవి 'ఇంటింటికి తెలుగుదేశం-ప్రతి ఇంటికి భూదేవి' అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను అందరికి తెలియపరిచారు. భూసర్వే అందరూ ఉండి చేయించుకోవాలని లేకపోతే మన భూములు కూడా దోచుకుంటారని అన్నారు. రేషన్ సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ ఒంటరి మహిళలకు పెన్షన్లు రావటం లేదని ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకోవటం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గొర్లె శ్రీరాములు, సవర కూర్మరావు, గంట సురాపాని, గొర్లె రాదయ్య, పత్తికి భాస్కరరావు, గంట భాస్కరరావు, నూకాలు, రౌలో, మీనా, వార్డు మెంబర్ బిడ్డిక రమణమ్మ, మహిళలు పాల్గొన్నారు.

సీతంపేటలో ఇదేం కర్మ

గుమ్మలక్ష్మీ పురం: ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

సీతంపేట : సీతంపేట మేజర్ పంచాయతీలో సోమవారం రాత్రి 'ఇదేం కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ సీతంపేట గిరిజన ప్రాంతంలో టిడిపి ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత అభివద్ధి అనేది శూన్యమైందన్నారు. గిరిజనలకు అందాల్సి ఏ ఒక్క పథకం కూడా అందలేదన్నారు. కనీసం బాషా వాలంటీర్లకు జీతాలు కూడా లేవన్నారు. నిత్యవసర ధరలు పెరుగుపోయాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షులు బిడ్డిక ధమయంతినాయుడు, వార్డు మెంబెర్ ఊయిక సుమలత, పెంటమ్మ, ఊయిక శ్రీనివాసరావు, మూర మోహన్, బుక్కూరు పాపారావు, తుండక శ్రీను, నిమ్మక చంటి, ప్రశాంత్, సురేంద్ర, ఇమరక పవన్, సవర ముఖలింగం, బిడ్డిక చంద్రరావు, సవర సోడంగా, నిమ్మక గంధర్వులు, నిమ్మక కిషోర్, రామారావు, బిడ్డిక సోను, ఆరిక సువర్ణ, భారతి, బిడ్డిక అప్పారావు, సవర సూర్యం, మూర మోహన్, మాజీ సర్పంచ్ సవర సోడంగ, సవర సూర్యం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి 35 మంది గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహం, రక్త పోటు, బరువు, ఎత్తు తదితరమైనవి తనిఖీలు చేసి మందులు పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ ఒ.శాంతి కుమారి, ఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని పెద్దఅంకలాం, సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం గర్భిణీలకు వైద్యాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఎం రాధాకాంతి, కె.శిరీష మాట్లాడుతూ గర్భిణీలు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసుకోవాలన్నారు గుర్తించి వారికి బలమైన ఆహారాలు అందించాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో వరలక్ష్మి, సత్యవతి, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

'యువశక్తి'ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- వీరఘట్టం

ఈనెల 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలం గ్రామంలో నిర్వహించనున్న యువశక్తి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జనసేన ఉత్తరాంధ్ర క్రియాశీలక సభ్యులు బి. ఫకీర్ నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం మండలంలోని నడుకూరు బిటవాడ గ్రామంలో యువశక్తి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతిపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం. పుండరికం, జనసేన జానీ, తదితరులు పాల్గొన్నారు.

12న ఆయా పోస్టుకు ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- వీరఘట్టం

సీతంపేట ఐటిడిఎలో ఈ నెల 12వ తేదీన వీరఘట్టం 6-సి ఆయా పోస్ట్‌కు సంబంధించి ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి సిడిపిఒ పూర్ణిమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పోస్టు సంబంధించి తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నారని, నిర్ణయించిన తేదీన ఉదయం 10 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

ప్రజాశక్తి- వీరఘట్టం

మండలంలోని యు.వెంకంపేట పంచాయతీ పరిధి మరియగిరి వద్ద బైక్ పంచరై కిమ్మి గ్రామానికి చెందిన తటికల్లా కూర్మనాయుడు, చందక కిరణ్‌లకు గాయాలయ్యాయి. సోమవారం ఉదయం స్వగ్రామం నుండి విజయనగరం జిల్లా రాజాంలో ఓ ఆసుపత్రికి చికిత్స కోసం కూర్మనాయుడు, కిరణ్ ద్విచక్ర వాహనంపై వెళ్లారు. ఆసుపత్రి పని ముగించుకుని తిరిగి వస్తుండుగా యు వెంకంపేట గ్రామ వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనం టైర్ పంచర్ అవడంతో రహదారి పక్కన ఉన్న చెట్టుకు ఢీకొన్నారు. వీరఘట్టం, పాలకొండ 108 వాహనాలకి ఫోన్ చేసినప్పటికీ అందుబాటులోలేకపోవడంతో సీతంపేట 108 వాహనం వచ్చి గాయపడిన ఇరువురుకు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రి తరలించారు.

400 నాటు సారా ప్యాకెట్లు సీజ్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీ పరిధిలో గల పెదరెల్లివీధిలో పోలీసులు, ఎస్ఇబి పోలీసులు సంయుక్తంగా నాటు సారా అమ్మకాలు, నిల్వలపై ఎస్ఇబి సిఐ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యాన సోమవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో 400 సారా ప్యాకెట్లు, 40 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని పెదరెల్లివీధికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ ఉపేంద్ర తెలిపారు.

సీతంపేట : మండలంలో వలగజ్జి సమీపంలో సవరరాజు, సవర గణేష్ 40 లీటర్లు నాటు సారా తెస్తుండగా ఎస్ఐ ఎ. నీలకంఠరావు మాటువేసి పట్టుకున్నారు. వీరిద్దరూ దిసర గూడకు చెందిన వారని చెప్పారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సారా రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. నాటుసారా విక్రయించిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీజ్ చేసిన ఖైనీలు, గుట్కాలు దగ్ధం

సాలూరు: పట్టణంలో 12కేసుల్లో సీజ్ చేసిన ఖైనీలు, గుట్కాలను సోమవారం పట్టణ పోలీసులు దగ్ధం చేశారు. పార్వతీపురం డిఎస్పీ ఎ.సుభాష్ పర్యవేక్షణలో టౌన్ సిఐ సిహెచ్.శ్రీనివాసరావు, ఎస్ఐలు పాపారావు, నారాయణరావు సమక్షంలో దగ్ధం చేశారు. వీటి విలువ రూ.4లక్ష 18,350 వరకు వుంటుందని అంచనా వేశారు.

693లీటర్ల సారా పాకెట్లు దగ్ధం

పార్వతీపురం : పట్టుబడిన నాటుసారాతో పోలీసులు

సాలూరు: మండలం లోని ఏజెన్సీ ప్రాంతంలో వివిధ కేసుల్లో పట్టుబడిన నాటుసారా పాకెట్లను సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా ఎస్ఇబి సూపరింటెండెంట్ ఆర్.సుధాకర్ పర్యవేక్షణ లో దగ్ధం చేశారు. పట్టణ శివారు ప్రాంతంలో పాత వంతెనపై 693లీటర్ల సారా ప్యాకెట్లను ధ్వంసం చేశారు. కొన్ని క్యాన్లలో దొరికిన సారాను నేలపాలు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అక్రమంగా తరలిస్తున్న సారా కేసుల్లో పట్టుబడిన సరుకుని ధ్వంసం చేసినట్లు సుధాకర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి సిఐ ఈశ్వరరావు వున్నారు.